సాక్షి
తూర్పుగోదావరి

శుక్రవారం । 5 । జనవరి । 2024



రూ.1,00,116 విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి వైట్ల అనిల్ కృష్ణ చౌదరి, నవ్య దంపతులు (ఆలమూరు) గురువారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



కొక్కొరొకో.. రక్షణ ఇదిగో...

శీతాకాలంలో కోళ్లకు ఎక్కువగా వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వీటి గురించి తెలుసుకుని మేలుకోకపోతే నష్టాలు తప్పవని అధికార యంత్రాంగం సూచిస్తోంది. - 8లో▸

10,700 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 10,700 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,050, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గడప గడపకూ మన ప్రభుత్వం కింద జిల్లాకు రూ.84.57 కోట్లు మంజూరయ్యాయన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా లక్ష్యానికి మించి 50,144 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. మిచాంగ్ తుపాను కారణంగా దెబ్బ తిన్న 18,540 రైతులకు సంబంధించిన 11,854 హెక్టార్ల పంటకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.1782.65 లక్షలతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా 18 మండలాల్లో జనవరి వరకూ 48 లక్షల పని దినాలు నిర్దేశించగా, ఇప్పటికే 43.10 లక్షలు కల్పించామని చెప్పారు. మొత్తం రూ.10.80 కోట్లకు గాను రూ.10.41 కోట్ల మేర పనుల వివరాలు అప్‌లోడ్ చేశామని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా 6,816 మందిని వైద్య చికిత్సకు సిఫారసు చేశారని, 4,745 మంది శస్త్రచికిత్సలు చేయించుకున్నారని చెప్పారు. 2,791 మందికి గాను 1,233 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేయించామన్నారు. 7,117 మందికి గాను 5,752 మందికి కళ్లజోళ్లు అందజేశామన్నారు. భూహక్కు పత్రాలు 445 మందికి చెందిన 837.90 ఎకరాలకు పంపిణీ చేసి, నూరు శాతం లక్ష్యం సాధించామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు రూ.10 లక్షల విరాళాలు



దేవాలయాలకు విరాళాలు అందజేసిన కన్నయ్య దంపతులు

నల్లజర్ల: గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఐడీసీ రిటైర్డు ఉద్యోగి కోర కన్నయ్య గురువారం రూ.5 లక్షల విరాళం అందజేసారు. ఈ సొమ్ముతో ఆలయంలో గ్రానైటు ద్వారాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, గ్రామ దేవత సోమాలమ్మ తల్లి ఆలయానికి మరో రూ.5 లక్షలు అందజేశారు.

తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం

కాకినాడ క్రైం: నగరంలోని ఓ స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రేచర్లపేటలోని యూపీహెచ్‌సీని ఆనుకుని ఉన్న ఈ దుకాణ యజమాని జాకీర్ హుస్సేన్ తన సాధారణ కార్యకలాపాలలో భాగంగా గురువారం మధ్యాహ్నం పాత విద్యుత్ తీగలకు మంట పెట్టి రాగిని సేకరిస్తున్నాడు. గాలికి ఆ మంటలు వ్యాపించి, పక్కన ఉన్న వ్యర్థాలకు అంటుకోవడంతో అగ్నికీలలు ఎగసిపడ్డాయి. స్థానికులు సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజిన్లతో చేరుకుని రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని సాలిపేట ఏడీఎఫ్‌వో సుబ్బారావు తెలిపారు. అగ్నిమాపక శకటాలు వచ్చేలోగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, పార్టీ మాజీ కార్పొరేటర్ రొక్కల సత్యనారాయణ బృందం సైతం మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు.

అమ్మ భాషకు పట్టాభిషేకం

- నేటి నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- గైట్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- తరలిరానున్న ప్రముఖులు

రాజానగరం: అందమైన లిపి.. అత్యధిక అక్షరాలు.. ఆనందం, అనురాగం, లాలన, ప్రేమ, ఆగ్రహం, ద్వేషం, మైత్రి.. ఇలా ఎటువంటి భావాన్ని వ్యక్తీకరించడానికైనా కావలసినన్ని అర్థవంతమైన పదాలు.. వాటికి సరితూగే వ్యుత్పత్తులు.. నానార్థాలు.. అత్యద్భుత పదబంధాలు.. పదసౌందర్యాలు.. ఛందోబద్ధమైన పద్యాలు.. ప్రాసలు.. ఇటువంటి ఎన్నో విశేషాలు మన తెలుగు భాషకే సొంతం. అందుకే 'దేశ భాషలందు తెలుగు లెస్స'.. అంటూ మన భాష గొప్పదనాన్ని శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యద గ్రంథంలో ఏనాడో కీర్తించాడు. అటువంటి అమ్మ భాషకు ముచ్చటగా మూడు రోజుల పండగ జరగనుంది.

ఏర్పాట్లు పూర్తి

ఎంతో చరిత్ర కలిగి, తెలుగువారి సాంస్కృతిక నగరంగా పేరొందిన రాజమహేంద్రవరాన్ని పరిపాలించిన రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలకు నీరాజనంగా.. ఆదికవి నన్నయ భట్టారకుని ఆంధ్ర మహాభారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. అమ్మ భాష కమ్మదనాన్ని తెలియజేసే విధంగా రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారు. ఈ మహాసభలకు రాజానగరం సమీపంలోని గోదావరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (గైట్) కళాశాల ప్రాంగణం వేదిక కానుంది. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యాన మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరగనున్నాయి. దేశ విదేశాల్లోని పలువురు ప్రముఖులను, భాషాభిమానులను ఈ మహాసభలకు మూడు నెలలుగా ఆహ్వానిస్తూ వచ్చారు. సుమారు 5 వేల మంది వరకూ ఈ మహాసభలకు హాజరు కానున్నారని అంచనా వేస్తున్నట్టు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) తెలిపారు. మహాసభలకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ ఇప్పటికే పూర్తి చేశారు.

ముచ్చటగా మూడు వేదికలు

- అంతర్జాతీయ తెలుగు మహాసభల కోసం ఆదికవి నన్నయ, నారాయణభట్టు, రాజరాజ నరేంద్రుని పేరిట మూడు వేదికలు ఏర్పాటు చేశారు. **తెలుగు భాషలోని 25 సాహితీ ప్రక్రియలపై ప్రముఖులతో సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ వేదికల నుంచి నిర్వహిస్తారు.**
- **శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఆది కవి** నన్నయ వేదికపై జరిగే అంకురార్పణ సభలో మాజీ ఎంపీ యార్ల గడ్డ లక్ష్మీప్రసాద్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వపు రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్ పాల్గొంటారు.
- ఉదయం 9 గంటలకు నారాయణభట్టు వేదికపై నిర్వహించే కవి సమ్మేళన అంకురార్పణ సభను శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ బుద్ధప్రసాద్ తదితరులు ప్రారంభిస్తారు.
- ఉదయం 10.30 గంటలకు రాజరాజనరేంద్రుని వేదికపై నుంచి విశాఖ శ్రీ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి దివ్యాశీస్సులతో జరిగే మహాసభల ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారు.
- ఉదయం 9 గంటలకు ఉప్పలదడియం భరతశర్మ అష్టావధానం జరుగుతుంది. దీనికి సహస్రావధాని కడిమిళ్ల వరప్రసాద్ సంచాలకత్వం వహిస్తారు.
- మధ్యాహ్నం 12 గంటలకు పద్యకవితా సదస్సు, గద్య సాహిత్య సదస్సు, అవధాన సాహిత్య సదస్సు, వాగ్గేయకార సాహిత్య సదస్సు నిర్వహిస్తారు.
- సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ పూర్ణకుంభ పురస్కారాల ప్రదానోత్సవం రాజరాజ నరేంద్రుని వేదికపై జరుగుతుంది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో దివంగత ప్రముఖులు తరిగొండ వెంగమాంబ, కవయిత్రి మొల్ల, తిక్కన సోమయాజి, డొక్కా సీతమ్మ, పరవస్తు చిన్నయసూరి, గుర్రం జాషువా, శ్రీపాద కృష్ణమూర్తి, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, కందుకూరి వీరేశలింగం పంతులు, దామోదరం సంజీవయ్య, బోయి భీమన్న, ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరి రాజేశ్వరరావు, పీబీ శ్రీనివాస్ కాశీపట్నం రామారావు, సిరివెన్నెల సీతారామశాస్త్రి, దాసరి నారాయణరావు, బాపు, జంధ్యాల, సీవీ రాఘవాచారి, తుర్లపాటి కుటుంబరావు, జాలాది రాజారావు తదితరుల కుటుంబ సభ్యులను, వారసులను సత్కరించనున్నారు.
- రాజవంశీకుల్లో మైలవరం, చింతపల్లి సంస్థానాధీశులను సత్కరిస్తారు.
- విశ్వనాథ గోపాలకృష్ణ, శలాక రఘునాథశర్మ, జిత్ మోహన్ మిత్రా, తల్లావఝుల పతంజలిశాస్త్రి, ఎల్లూరి శివారెడ్డి, రసరాజు, ఎర్రాప్రగడ రామకృష్ణ, తనికెళ్ల భరణి, వేదాంతం రాధేశ్యామ్, కూచిభొట్ల ఆనంద్, బాదం బాలకృష్ణ, మహ్మద్ ఆలీ తదితరులకు తెలుగు - వెలుగులు పురస్కారాలు ప్రదానం చేస్తారు.
- పత్రికలు–సాహిత్య సాంస్కృతిక సంస్థల రంగం నుంచి కూడా పలువురు ప్రముఖులను సత్కరిస్తారు.
- శనివారం తెలుగు తోరణం సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నృత్యరూపకం ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా కూడా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరిస్తారు.
- ఉదయం భక్తి సాహిత్య సదస్సు, కవితా సాహిత్య సదస్సు, మధ్యాహ్నం బాల, తెలుగు వైజ్ఞానిక, పత్రిక, గేయ, కథా సాహిత్య సదస్సులు నిర్వహిస్తారు.
- ఆదివారం ఉదయం ప్రవాసాంధ్రుల సాహితీ తపస్సు, ఆకాశవాణి, బుల్లితెరలపై తెలుగు వికాసం, ఆధునిక, ప్రదర్శనాత్మక కళల, హాస్య, వ్యంగ్య, చమత్కార, చలనచిత్ర సాహిత్యాలపై సదస్సులు జరుగుతాయి. మధ్యాహ్నం 'ఆంధ్ర మేవ జయతే' పేరిట సభ, సాయంత్రం మహాసభల సమాపనోత్సవం నిర్వహిస్తారు.
- ఈవిధంగా భాషాభిమానులను అలరించేలా మూడు రోజుల పాటు అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



వేదిక ముంగిట ఏర్పాటు చేసిన మొల్ల, ఎంఎస్ సుబ్బులక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ విగ్రహాలు





వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న గజల్ శ్రీనివాస్

డాక్టర్ యనమదలకు మధునాపంతుల ప్రతిభా పురస్కారం

14న పల్లిపాలెం ఆంధ్రీ కుటీరంలో ప్రదానం



డాక్టర్ మురళీకృష్ణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రజా వైద్యుడిగా పేరొందిన కాకినాడకు చెందిన వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ యనమదల మురళీకృష్ణ మధునాపంతుల ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయుర్వేద వైద్యునిగా, కవిగా, పండితునిగా ఖ్యాతిగాంచిన కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామానికి చెందిన మధునాపంతుల సూరయ్యశాస్త్రి శతజయంత్యుత్సవాల సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు ఈ పురస్కారాలు ప్రకటించారు. ఈ నెల 14న పల్లిపాలెం మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ యనమదల మురళీకృష్ణను ప్రతిభా పురస్కారంతో సత్కరించనున్నారు. కోవిడ్-19, దీర్ఘకాలిక వ్యాధులపై సాధికారమైన వైద్య విజ్ఞానాన్ని ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకుని రావడం, వీటిపై ప్రజల్లో భయాలను తొలగించి, భరోసా కల్పించినందుకు ఆయనను ఈ పురస్కారంతో గౌరవిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 2000లో డాక్టర్ యురళీకృష్ణ ప్రచురించిన 'ఎయిడ్స్' పుస్తకం 8 వేల ప్రతులు పదేళ్లలో తెలుగు ప్రజలకు చేరాయి. 1998–2000 మధ్య ఎయిడ్స్‌పై ఆయన విస్తృత అవగాహన కల్పించారు. ఇటీవల ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారిపై ప్రజలకు ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా డాక్టర్ యనమదల ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందించారు. ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపకరించాయి. 2022 జనవరిలో ఆయన ప్రచురించిన 'కోవిడ్, ఎయిడ్స్ నేను' ఆత్మకథాత్మక వైద్య విజ్ఞాన గ్రంథం తెలుగు నాట అత్యంత ప్రజాదరణ పొందింది. వీటిన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మురళీకృష్ణను ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారు.

శరవేగంగా..

- చురుకుగా బ్యారేజీ మరమ్మతులు
- నెలాఖరుకు పూర్తి
- పనులను పరిశీలించిన కలెక్టర్

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ రోడ్డు మరమ్మతు పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.2 కోట్ల వ్యయంతో బ్యారేజీ పరిధిలోని మొత్తం 6.8 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ రోడ్డుపై గతంలో వేసిన లేయర్‌ను పూర్తిగా తొలగించారు. ఈ నెలాఖరుకు బ్యారేజ్ పైకి పూర్తి స్థాయిలో వాహనాలను అనుమతించే విషయంపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా కలెక్టర్ కె.మాధవీలత బ్యారేజీపై జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నిర్మాణ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలన్నారు. పనులు నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కాటన్ బ్యారేజీ రోడ్డు తరచూ మరమ్మతులకు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా రూ.2 కోట్లు కేటాయించింది. బ్యారేజీపై గతంలో వేసిన లేయర్‌ను పూర్తిగా తొలగించి, కొత్తగా పటిష్టంగా రోడ్డు వేస్తున్నారు. దీనివలన రోడ్డు ఎక్కువ కాలం పాడవకుండా ఉండే అవకాశం ఉంటుంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రోడ్డు సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంపై వాహనచోదకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, డీఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కాటన్ బ్యారేజీ రోడ్డును పరిశీలించి, ఇరిగేషన్ అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మాధవీలత



కొనసాగుతున్న మరమ్మతు పనులు

సున్నిత ప్రాంతాలపై సమగ్ర నివేదిక

- కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్ ఆదేశం
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): త్వరలో జరిగే ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు వీలుగా గత రెండు ఎన్నికల్లో గుర్తించిన సున్నిత ప్రాంతాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల వ్యయం, సున్నిత నియోజకవర్గాల గుర్తింపుపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వారు కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సున్నిత ప్రాంతాల్లో గత ఆరు నెలల్లో గుర్తించిన అంశాలను కూడా నివేదికలో పొందుపరచాలన్నారు. ఖర్చులు, అసాధారణ స్థాయిలో లావాదేవీలు, నగదు లావాదేవీలు, బ్యాంకు ఖాతాల ద్వారా ఎక్కువ మందికి ఒకే ఖాతా నుంచి డబ్బులు బదిలీ కావడం వంటి ప్రతి అంశాన్నీ సునిశితంగా పరిశీలించి, వివరాలు అందజేయాలని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో సంబంధిత అధికారులు ప్రతి వారానికి సంబంధించి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అధికారులందరూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గత ఎన్నికల్లో నగదు, మద్యం, ఉచితాలు మొదలైన వాటి లావాదేవీలపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లా వ్యయ పరిశీలకులు, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల అధికారులు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఈ అంశాలపై సమీక్షిస్తారని తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

కలెక్టరేట్ వద్ద ఈవీఎం ప్రదర్శన

కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్ డెస్క్‌లో ఎన్నికల ప్రక్రియలో వినియోగించే కంట్రోల్ యూనిట్లు, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ప్రదర్శనను కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, డీఆర్‌ఓ జి.నరసింహులుతో కలిసి ప్రారంభించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. ఈ పరికరాల పని విధానాన్ని సిబ్బందికి వివరించారు. వీటిపై కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కోడిపందాలు, జూదాలపై నిషేధం

సంక్రాంతి పండగ సందర్భంగా జూదాలు, కోడిపందాలపై నిషేధం ఉందని, ఎక్కడైనా బరులు ఏర్పాటు చేస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ మాధవీలత అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై రూపొందించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు, రెవెన్యూ, పశుసంవర్ధక, సంబంధిత సమన్వయ శాఖల అధికారులు కోడిపందాల నిర్వాహకులపై దృష్టి సారించాలని సూచించారు. వీటిని నిరోధించేందుకు విస్తృతంగా దాడులు నిర్వహించి, కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. పొలాల్లో బరులు వేసే యజమానులపై కూడా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా కోడిపందాలు, జూదాలు వంటి కార్యకలాపాల్లో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా కల్తీ మద్యం విక్రయాల నిరోధానికి ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశాల్లో డీఆర్‌ఓ జి.నరసింహులు, ఎస్ఈబీ అధికారి పి.సోమశేఖర్, జిల్లా ఎక్సైజ్ అధికారి వై.శ్రీలత, జీఎస్టీ జాయింట్ కమిషనర్ జె.నీరజ, ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి పి.పద్మావతీదేవి, జిల్లా రవాణా అధికారి కేఎస్ఎంవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

11 జిల్లాల అధికారులకు నేటి నుంచి శిక్షణ

సామర్లకోట: స్థానిక ఈటీసీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని అధికారులకు శుక్రవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. రెండు రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ గురువారం తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, డీఎల్‌పీఓలకు శిక్షణ ఇస్తామన్నారు.

కొక్కొరొకో.. రక్షణ ఇదిగో...



- ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పౌల్ట్రీలు
- చలికాలంలో కోళ్లకు వ్యాధులు సోకే అవకాశం
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న అధికారులు

రాయవరం: పౌల్ట్రీ రంగం రైతులకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. రాష్ట్రంలో జిల్లా కోడిగుడ్ల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ శీతాకాలంలో కోళ్లకు ఎక్కువగా వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వీటి గురించి తెలుసుకుని మేలుకోకపోతే నష్టాలు తప్పవని అధికార యంత్రాంగం సూచిస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 200 పౌల్ట్రీలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పెరటికోళ్లు 37,94,010 ఉండగా, పౌల్ట్రీల్లో 5.27 లక్షల లేయర్, బాయిలర్ కోళ్లు పెంచుతున్నారు. కోళ్లకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా లేకపోతే నష్టాలు తప్పవని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కర్నీడి మూర్తి సూచిస్తున్నారు. వ్యాధి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

జాగ్రత్తలు తప్పనిసరి



కోళ్లకు వేసే టీకా మందులు ఎప్పుడూ ఐస్ లేదా ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇతర రోగాలున్నప్పుడు టీకాలు వేయరాదు. కోళ్ల అస్వస్థతకు గురైతే టీకాలు వేయించరాదు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే టీకాలు వేయడం మంచిది. ఈ మందు సీసా నుంచి తీసి కలిపిన తర్వాత రెండు గంటల లోపే వాడాలి.

–డాక్టర్ కర్నీడి మూర్తి, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్



కోడికి వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యుడు

కొక్కెర తెగులు వస్తే..

న్యూకేజిల్ డిసీజ్‌గా పిలిచే 'కొక్కెర' మిగతా వ్యాధులన్నింటి కంటే అత్యంత ప్రమాదకమైంది. ఈ వ్యాధితో ఎక్కువ సంఖ్యలో కోళ్లు చనిపోతాయి. రోగానికి గురైన కోళ్లు ముడుచుకుని ఉండి రెక్కలు వేలాడదీసుకుంటాయి. పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి. మెడ వెనక్కి వాలుతుంది. విరేచనాలు తెలుపు, ఆకుపచ్చ రంగులో అవుతాయి. శ్వాసలో ఇబ్బంది వస్తుంది. సన్నని రక్తపు గడ్డల చుక్కలు గిజార్డు, పెకార్డియంలో కనబడతాయి. దీని నివారణకు మొదటి, నాలుగో వారం, ఆ తర్వాత 6–8 వారాల మధ్య మరోసారి, చివరగా 20వ వారం టీకాలు వేయడంతో చాలా వరకూ కోళ్లను రోగాల నుంచి రక్షించుకోవచ్చు. వ్యాధి సోకిన కోళ్లను మట్టిలో కప్పెట్టాలి లేదా కాల్చివేయాలి. ఈ వ్యాధి లక్షణాలున్న కోడి మాంసం తినరాదు.

మసూచి వ్యాధి సోకితే..

కోళ్లకు వచ్చే అంటువ్యాధుల్లో ముఖ్యమైనది మసూచి (ఫాల్‌పాక్స్). దీనివల్ల గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గి కోళ్లు చనిపోతాయి. కోళ్ల జుట్టు, తమ్మెలకు కనురెప్పల చుట్టూ పొక్కులు వస్తాయి. అప్పుడప్పుడు కళ్లలో కూడా ఈ పొక్కులు వచ్చి కళ్లు కనబడవు. దీని నివారణకు టీకాలు వేయించడం ఒక్కటే మార్గం. ఇవి 6–7 వారాల వయసులో, తిరిగి 16–17 వారాల మధ్య వేయించాలి.

కొరైజాతో నష్టాలు..

గురక వ్యాధిగా పిలిచే కొరైజా శీతాకాలంలోనే సోకుతుంది. కోడిపిల్లలు సరిగా నీటిని తాగక, మేతను తినక బరువును కోల్పోతాయి. ముక్కు, కళ్ల నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒకసారి ఈ వ్యాధి కోళ్లలోకి ప్రవేశిస్తే అన్ని కోళ్లకు రోగం వస్తూనే ఉంటుంది. పౌల్ట్రీల్లో కోళ్లకు ఈ వ్యాధి వచ్చినప్పుడు కొద్ది రోజులు షెడ్లు ఖాళీగా పెట్టి, బ్లోలాంప్‌తో నేల, గోడలను కాల్చాలి. ఫార్మాలిడిహైడ్‌తో ఫ్యూమిగేషన్ చేయాలి. సున్నం, గమాక్సిన్, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ కలిపి గోడలకు వేయాలి. రోగం సోకిన పిల్లలకు హూస్టసైక్లిన్, ఫ్లాక్సైడ్ లేదా ఇతర యాంటి బయోటిక్ మందులు విటమిన్‌తో కలిపి వారం రోజులు వాడితే పూర్తిగా నయం అవుతుంది.

బ్యాక్టీరియాతో వ్యాధులు

బ్యాక్టీరియా కారణంగా కోడిపిల్లలు ఎక్కువగా సాల్మునెల్లా పుల్లోరం వ్యాధికి గురవుతాయి. ఈ వ్యాధి తల్లి నుంచి పిల్లలకు గుడ్ల ద్వారా కూడా సంక్రమిస్తుంది. రోగం సోకిన పిల్లలు గుమిగూడడం, భారంగా శ్వాస తీసుకోవడం, మెడ వాల్చడం గమనించవచ్చు. దీని నివారణకు యాంటి బయోటిక్ మందులు వాడాలి.

- ఎస్చరీషియా కొలై వ్యాధి బాయిలర్ కోళ్లలో తీవ్రంగా వస్తుంది. బ్యాక్టీరియాతో వచ్చే ఈ వ్యాధితో కోళ్లలో బరువు సరిగ్గా రాదు. నివారణకు యాంటి బయోటిక్ మందులు మేత, నీటితో ఇవ్వాలి. దీంతో పాటు పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం మందును కోళ్లకు పట్టించాలి.

రక్తపారుడు రోగం

ప్రోటోజోవా వల్ల సోకే ఈ వ్యాధితో తరచూ బాయిలర్ కోళ్ల పరిశ్రమ తీవ్ర నష్టానికి గురవుతుంది. మేతలో కాక్సిడియోస్టాట్స్ సరైన మోతాదుల్లో వాడనప్పుడు ఈ వ్యాధి వస్తుంది. 11వ రోజు నుంచి 8వ వారం లోగా ఎప్పుడైనా, ఈ వ్యాధి బ్రాయిలర్ పిల్లలకు సోకవచ్చు. రోగం సోకిన కోడిపిల్లల్లో నోటి ద్వారా వాంతులు అవుతాయి. మేత, నీరు తక్కువగా తీసుకుంటాయి. మేత, నీటిలో కాక్సిడియోస్టాట్ మందులు తగు మోతాదులో వాడితే రోగాన్ని నివారించవచ్చు.

పంట కాలువలోకి కారు బోల్తా



బక్కివారిపేట వద్ద పంట కాలువలో బోల్తా పడిన కారు

కాట్రేనికోన: మండలంలోని బక్కివారిపేట సమీపంలో ఓ కారు అదుపుతప్పి పంట కాలువలో పడిపోయింది. స్థానికుల కథనం ప్రకారం. చెయ్యేరుకు చెందిన ఇద్దరు యువకులు మొండిపోర చెరువుల వద్దకు వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో బక్కివారిపేట వద్ద ప్రమాదం జరిగింది. దారి తప్పి ముందుకు వెళ్లిన కారును వెంకమ్మ చెరువు వైపు వెనకకు తిప్పుతున్న సమయంలో కారు బోల్తా పడింది. వెంటనే స్థానికులు కారు తలుపులు తెరిచి యువకులను రక్షించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కారును జేసీబీ సాయంతో బయటకు తీశారు.

20 ఎకరాల చెరకు తోట దగ్ధం

రూ.8 లక్షల ఆస్తినష్టం

గోపాలపురం: మండలంలోని తొక్కిరెడ్డిగూడెంలో సుమారు 20 ఎకరాల చెరకు తోట గురువారం దగ్ధమైంది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారి బి.జహంగీర్ కథనం ప్రకారం.. తొక్కిరెడ్డిగూడెంలో గోపాలపురం గ్రామానికి చెందిన బోళ్ల భాస్కరరావుకు చెందిన చెరకు తోట ఉంది. ఈ తోటలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడడంతో నిప్పురవ్వలు చెలరేగాయి. చెరకు తోట కింది భాగంలో ఎండిన ఆకుల ఉండటంతో ఈదురు గాలులకు మంటలు రేగి సుమారు 20 ఎకరాల్లోని తోట పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.8 లక్షల నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. చుట్టుపక్కల రైతులు వచ్చి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతు భాస్కరరావు తెలిపారు.



చెరకు తోటలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లక్ష్మీనృసింహుని హుండీల ఆదాయం లెక్కింపు



అంతర్వేది ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కించారు. మొత్తం 98 రోజులకు గాను భక్తుల నుంచి విరాళాలుగా రూ.47,00,060 ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపును జిల్లా దేవదాయ శాఖ అధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్, తనిఖీదారుడు జె.రామలింగేశ్వరరావు సమక్షంలో సిబ్బంది నిర్వహించారు. కాగా మొత్తం ఆదాయంలో ప్రధాన హుండీ, గుర్రాలక్క అమ్మవారి గుడి హుండీల ద్వారా రూ.46,08,255, అన్నదాన హుండీ ద్వారా రూ.91,805 ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు, అర్చకులు, స్వామివారి సేవకులు పాల్గొన్నారు.

జిల్లాకు వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ అవార్డు

కాకినాడ సిటీ: భారత ప్రభుత్వం 2023 సంవత్సరానికి ప్రతిష్టాత్మక వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ జాతీయ అవార్డులను ప్రకటించింది. ఇందులో వ్యవసాయేతర విభాగం కింద ఉప్పాడ జాందానీ చీరల ఉత్పత్తులకు సంబంధించి జిల్లాకు గోల్డ్ అవార్డు లభించింది. ఈ నెల 3న ఢిల్లీలోని భారత మండపంలో ఆత్మ నిర్భర్ భారత్ ఉత్సవ్–2024 వేడుకల్లో కేంద్ర విదేశాంగ మంత్రి సుబ్రమణ్యం జయశంకర్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా జిల్లాకు ఈ అవార్డు ప్రదానం చేశారు. కలెక్టర్ తరఫున జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కూరెళ్ల పెద్దిరాజు ఈ అవార్డు అందుకున్నారు. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ అవార్డులకు జాతీయ స్థాయిలో మొత్తం 560 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో 64 మాత్రమే నామినేట్ అయ్యాయి. వీటిలో వివిధ రాష్ట్రాలకు చెందిన 16 ఉత్పత్తులు జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నాయి. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా పొందూరు చీరలకు, కర్నూలు జిల్లా హ్యాండ్లూమ్ సిల్క్ చీరలకు సంయుక్తంగా బ్రాంజ్ అవార్డులు దక్కాయి. అలాగే మదనపల్లి సిల్క్ చీరలకు అన్నమయ్య జిల్లా, మంగళగిరి హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు గుంటూరు జిల్లా కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాయి. కాకినాడ జిల్లాకు లభించిన ఈ అవార్డును జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి పెద్దిరాజు గురువారం కలెక్టర్ కృతికా శుక్లాకు అందజేశారు. జిల్లాకు జాతీయ అవార్డు లభించడంపై కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు ద్వారా ఉప్పాడ జాందానీ చీరలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుళ ప్రాచుర్యం లభించనుందని అన్నారు. ఇందుకు అనుగుణంగా జాందానీ చీరల ఉత్పాదనను పెంచేందుకు, తద్వారా చేనేత కార్మికుల ఆర్థిక వికాసానికి అవసరమైన సదుపాయాల విస్తరణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని చేనేత, జౌళి శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు.

చతుర్వేద మహాయాగం ప్రారంభం

రాజానగరం: ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించే చతుర్వేద మహాయాగం, శ్రీవారి వైభవోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఎండీ కె.రవికిరణ్‌వర్మ, గైట్ కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులచే వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీవారి వైభవోత్సవంలో తిరుమలేశుని నమూనా విగ్రహాన్ని ఏర్పాటు చేసి సుప్రభాతం, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, నివేదన, సర్వదర్శనం, తిరుప్పావై సేవతో శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని ఆగమ పండితులు దీవి బాలాజీ రంగాచార్యుల ఆధ్వర్యంలో కనుల పండుగగా నిర్వహించారు. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి సర్వదర్శనం, శుద్ధి ఏకాంత సేవలు జరిగాయి. అన్నవరం, ద్వారకాతిరుమల నుంచి వచ్చిన రథాల్లో సత్యనారాయణ స్వామి, శ్రీవేంకటేశ్వరుడు, అమ్మ వార్లకు అర్చకులు పూజలు చేశారు. ఇదే ప్రాంగణంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకలతో గైట్ కళాశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్సీ ఈలి నాని తదితరులు పాల్గొన్నారు.




శ్రీవారి వైభవోత్సవం వద్ద తిరుమలేశుని దర్శించుకుంటున్న భక్తులు



చతుర్వేద మహాయాగంలో పాల్గొన్న చైతన్యరాజు దంపతులు

రాముని ఆశీర్వచనంతో జటాయువుకు పుణ్యగతులు

సద్గురు సామవేదం షణ్ముఖశర్మ



అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దశరథునికి పట్టని భాగ్యం జటాయువుకు దక్కిందని, రామచంద్రుడు జటాయువుకు అంతిమ సంస్కారాలు చేసినట్టు సద్గురు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. రాజమహేంద్రవరంలోని హిందూ సమాజంలో ఆయన 23వ రోజు ప్రవచనం గురువారం కొనసాగింది. 'నీకు పునరావృత్తి రహిత శాశ్వత ఉత్తమ లోకాలు లభిస్తాయని రాముడు పక్షిరాజును ఆశీర్వదించాడని సామవేదం సభికులకు వివరించారు. మార్గ మధ్యంలో ఎదురైన కబంధుడు అనే రాక్షసునికి దహన సంస్కారాలు జరిపి, ఆ రాక్షసునికి శాప నివృత్తి చేశాడని, తపస్సు చేస్తున్న శబరికి రామ దర్శనం కావడంతో ఆమె తపము ఫలించి ఉత్తమ లోకాలకు చేరుకుందని ఆయన పేర్కొన్నారు. శబరి ఆటవిక జాతికి చెందినదని చెప్పడానికి ఆధారాలు లేవని, మహా తపస్విని అయిన ఆమె రామలక్ష్మణులకు తన ఉచ్ఛిష్టాన్ని (ఎంగిలి చేసిన పదార్థం) నివేదించిందనడం సరికాదని, ఉచ్ఛిష్టం దోషం కనుకనే మంచి నీరు తాగేటప్పుడు సైతం మన ప్రాచీనులు పాత్రను ఎత్తి పట్టుకుని, నీటిని తాగేవారని సామవేదం వివరించారు. జటాయువు రామునితో ఆఖరి క్షణాల్లో మాట్లాడుతూ రావణుడు వింద అనే ముహూర్తంలో సీతని అపహరించాడని, ఇది వాడికి ప్రాణహాని కలిగించే ముహూర్తమని చెప్పాడన్నారు. ఈ ముహూర్తంలో ఏదైనా పోగొట్టుకున్నా దానిని యజమాని తప్పక పొందుతాడని జటాయువు రామునికి వివరించినట్టు షణ్ముఖశర్మ పేర్కొన్నారు. దీనిని బట్టి జటాయువుకు కూడా జ్యోతిషంలో ప్రతిభ ఉందని మనం భావించవచ్చని ఆయన అన్నారు. ఈ క్రమంలో ఆయన అరణ్యకాండం పూర్తి చేసి కిష్కింధ కాండను ప్రారంభించారు. హనుమతో రామలక్ష్మణుల తొలి సమావేశంలోనే రాముడు హనుమ బుద్ధి కుశలతను గుర్తించాడన్నారు. రాముని అభిమానాన్ని చూరగొరే వ్యక్తికి ఉండాల్సిన లక్షణం ధర్మాచరణ అని హనుమ గుర్తించాడని, రామ హనుమల తొలి సమావేశం కిష్కింధ కాండలో కీలక ఘట్టమని సామవేదం సభికులకు వివరించారు.

అహంకారమే నాశనానికి తొలిమెట్టు

మహా సహస్రావధాని గరికిపాటి



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న గరికిపాటి నరసింహారావు

అనపర్తి: అహంకారమే మనిషి నాశనానికి తొలి మెట్టు అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని మహా సహస్రావధాని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. అనపర్తి శ్రీశారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో 25వ శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మహాభారతంలో కుంతీదేవి పాత్రను విశ్లేషిస్తూ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరికలే దుఃఖానికి మూలమన్నారు. నిశ్చలమైన మనసుతో మోక్ష సిద్ధి కలుగుతుందన్నారు. మహాభారతంలో కుంతీదేవి త్యాగనిరతిని వివరించడంతో పాటు తనదైన శైలిలో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ ఆహుతులను అలరించారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, నేత్ర వైద్యుడు తేతలి సత్యనారాయణరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, ఎన్‌సీఆర్ భాస్కరరెడ్డి, అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ టి.రామగుర్రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పటిష్టంగా భూ రక్ష రీసర్వే పనులు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- అధికారులకు పలు సూచనలు

అమలాపురం రూరల్: రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ, జగనన్న శాశ్వత భూహక్కు– భూ రక్ష రీసర్వే మూడో దశ పనులు పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అమరావతి నుంచి 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, అసైన్డ్ భూములపై హక్కుల కల్పన, ఉపాధి పథకంలో పని దినాల కల్పన, జల్‌జీవన్ మిషన్ పనుల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధించే దిశగా ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు ఉద్దేశించిన జల్‌జీవన్ మిషన్ పథకం లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

భూసేకరణ వేగవంతం చేయండి

జిల్లాలో జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌కు కావాల్సిన భూ సేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జర్నలిస్ట్ హౌసింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ వెరిఫికేషన్ ద్వారా ఇప్పటి వరకూ 212 దరఖాస్తులు ఇళ్ల స్థలాల కోసం విజయవాడ సమాచార పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చాయన్నారు. ఇందులో అమలాపురం డివిజన్ సంబంధించి 114, కొత్తపేట రెవెన్యూ డివిజన్‌కు 45, రామచంద్రపురం డివిజన్‌కు 46 దరఖాస్తులు ఉన్నాయన్నారు.

యువకుడి అదృశ్యం

కొవ్వూరు: పశివేదల గ్రామానికి చెందిన ఉప్పులూరి గౌతమ్ (16) గత నెల 30వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని తల్లి వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో గౌతమ్ ఇంటర్ చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. గత నెల 29న పశివేదల వచ్చాడు. 30న హాస్టల్‌కి పంపించే నిమిత్తం కొవ్వూరు స్టాండ్ వద్ద రెండో కుమారుడు గౌతమ్‌ను మోటారు సైకిల్‌పై తమ మొదటి కుమారుడు దింపాడని వెంకటరత్నం తెలిపారు. తర్వాత కళాశాలలో ఆరా తీయగా గౌతమ్ రాలేదని తెలిసిందన్నారు. పలుచోట్ల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు వివరించారు.